సాక్షి
కాకినాడ
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



శ్రీవారి ఆదాయం రూ.2.13 కోట్లు


ద్వారకాతిరుమల: వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. గడిచిన 23 రోజులకు రూ.2.13 కోట్లు వచ్చిందని ఈఓ త్రినాథరావు తెలిపారు.

SPL SAKSHI PREMIER LEAGUE

పొట్టి ఫార్మెట్‌లో గట్టి ఫైట్

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో భాగంగా గురువారం నిర్వహించిన మ్యాచ్‌లు పోటాపోటీగా జరిగాయి. - 8లో▸

డెల్టాలకు 5,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 5,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,760, మధ్య డెల్టాకు 1,145, పశ్చిమ డెల్టాకు 3,065 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఎస్ఈబీ ఎస్సై ప్రసాద్ సస్పెన్షన్



ప్రత్తిపాడు రూరల్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక ఎస్ఈబీ ఎస్సై ఎస్ఎస్ఎస్‌వీ ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెంలో సారాతో పట్టుబడిన మహిళను కేసు నుంచి తప్పించేందుకు ఎస్ఈబీ ఎస్సై ప్రసాద్ సొమ్ములు డిమాండ్ చేసినట్టు ఫోన్ సంభాషణ వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ అనంతరం ఉన్నతాధికారులు ఎస్సై ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చేయూత మహిళా మార్టులో రూ.కోటి అమ్మకాలు



డీఆర్‌డీఏ పీడీ రమణికి సత్కారం

కొత్తపల్లి: రాష్ట్రంలోనే తొలిసారిగా ఉప్పాడలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన చేయూత మహిళా మార్టులో రికార్డు స్థాయిలో రూ.కోటి మేర అమ్మకాలు జరిగాయి. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ కె.రమణిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు, గ్రామీణాభివృద్ధి శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ బుధవారం విజయవాడలో సత్కరించారు. ఉప్పాడ మార్టు విషయంలో ఆమె కృషిని అభినందించారు. ఈ మార్టు అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సిబ్బందిని కూడా ప్రశంసించారని ఏపీఎం విష్ణు తెలిపారు.

10న డీవార్మింగ్ డే



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శాంతిప్రభ

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఈ నెల 10వ తేదీన డీవార్మింగ్ డే నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ శాంతిప్రభ తెలిపారు. ప్రోగ్రాం, మెడికల్ అధికారులతో కాకినాడలోని తన కార్యాలయంలో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఆ రోజు డీఈసీతో కలిపి ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. 11, 12 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి ఈ మాత్రలు వేయాలన్నారు. ఫైలేరియా వ్యాధి నిర్మూలనకు వేసే ఈ మాత్రలు రెండేళ్ల లోపు పిల్లలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేయరాదన్నారు.

ఈ స్కూళ్లకు చికిత్స చేయాల్సిందే

- జిల్లాలో ప్రైవేటు నర్సింగ్ స్కూళ్ల కిరికిరి
- స్టూడెంట్లు లేని స్కూళ్లు.. టీచర్లు లేని క్లాసులు..
- పర్యవేక్షణ లేక నిబంధనలకు తిలోదకాలు
- మాస్ కాపీయింగ్‌తో బహిర్గతమైన వైనం

కాకినాడ క్రైం: వైద్యుల తర్వాత అంతటి స్థాయి ఉన్నవారు నర్సులు. ఎన్నో కీలక వేళల్లో ప్రజారోగ్య పరిరక్షణలో, ప్రాణాల్ని కాపాడటంలో వారిది గురుతర బాధ్యత. నేర్చుకోవడం, ఆచరించడం, రక్షించడం వారి వృత్తి జీవితంలో ఇమిడి ఉండే అంశాలు. వైద్యులకైనా దక్కని సోదరి భావం నర్సులతోనే ముడిపడి ఉంటుంది. అందుకే యావత్ ప్రపంచం 'సిస్టర్' అంటూ వారిని ఆప్యాయంగా పిలుచుకుంటుంది. అటువంటి పవిత్ర వృత్తి జీవనం కొన్నిచోట్ల ఆరంభ దశలోనే అభాసుపాలవుతోంది.

దయనీయంగా నర్సింగ్ విద్య

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నర్సింగ్ విద్యా విధానంపై విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా జరిగిన నర్సింగ్ పరీక్షలు ఈ విషయాన్ని కళ్లకు కట్టాయి. ఇంటర్మీడియెట్ పూర్తయి జీఎన్ఎంలో చేరిన విద్యార్థులు పాఠాలెలా నేర్చాలి, పరీక్షలెలా రాయాలి అనే విషయాన్ని విస్మరించి, స్లిప్పులు పెట్టడంలో నేర్పరితనం ప్రదర్శించారు. విషయం బట్టబయలై కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో కాపీయింగ్ మూలాలపై క్షేత్రస్థాయి పరిశీలన మొదలైంది.

అంతా కిరికిరి

స్టూడెంట్లు లేని స్కూళ్లు.. టీచర్లు లేని క్లాసులు.. అన్నట్టుగా ఉంది కొన్ని నర్సింగ్ స్కూళ్ల పరిస్థితి. జిల్లా పరిధిలో 54 నర్సింగ్ స్కూళ్లు ఉన్నాయి. కనీసం ఐదుగురు సభ్యులతో సొసైటీగా ఏర్పడి నర్సింగ్ స్కూల్ రిజిస్ట్రేషన్ పొందాల్సి ఉంటుంది. చాలాచోట్ల కనీస నిబంధనలు పాటించకుండానే స్కూళ్లు ఏర్పాటయ్యాయి. స్థానిక పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణం. అప్పటికప్పుడు అభూత కల్పనలతో అనుమతులు పొందడంలో ప్రైవేటు యాజమాన్యాలు ఆరితేరిపోయాయి. రాష్ట్ర విభాగం నుంచి ఎవరైనా అధికారులు వస్తే నర్సింగ్ చదివి ఖాళీగా ఉన్న విద్యార్థులో, మరెక్కడో పని చేస్తున్న సిబ్బందినో తీసుకువచ్చి మేనేజ్ చేస్తున్నారనే విమర్శలు ఎక్కువయ్యాయి.



విద్యార్థుల తరగతుల నిర్వహణపై ఆరా తీస్తున్న పూర్వపు డీఎంహెచ్ఓ డాక్టర్ మీనాక్షి (ఫైల్)



నర్సింగ్ స్కూల్ వసతి గృహంలో ఉంటూ రక్తహీనతకు గురైన విద్యార్థిని ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తూ (ఫైల్)

అక్కడ స్కూళ్లే లేవు

ప్రతి స్కూలుకు ప్రభుత్వం 50 సీట్లకు అనుమతి ఇచ్చింది. ఎక్కువ మంది విద్యార్థులకు ప్రభుత్వమే స్కాలర్‌షిప్‌ల రూపంలో ఫీజులు చెల్లిస్తుంది. మిగిలిన సీట్లను ఏడాదికి కనీసం రూ.50 వేల నుంచి రూ.70 వేల మొత్తానికి మేనేజ్‌మెంట్ కోటా రూపంలో విక్రయిస్తున్నారు. కొందరు బినామీ పేర్లతో రెండు నుంచి ఆరు స్కూళ్ల వరకూ అనుమతులు పొందారు. తరగతి గదులు కనీసం 20 వేల చదరపు గజాలు, వసతి గృహం 17,500 చదరపు గజాల విస్తీర్ణంలో ఉండాలి. సరిగ్గా అదే కొలతలతో ఉన్న ప్రదేశాలను రిజిస్ట్రేషన్ సమయంలో చూపుతున్న యాజమాన్యాలు.. వాస్తవానికి ఆ స్కూళ్లను మరోచోట నిర్వహిస్తున్నారు. కాకినాడ చిరునామాతో నమోదైన రెండు స్కూళ్ల ప్రాంగణాలను పరిశీలిస్తే.. ఓ స్కూలు ప్రాంగణంలో బొగ్గుల అమ్మకం, మరో స్కూలు చిరునామా ఉన్న ప్రాంతంలో కుల్ఫీ, పానీపూరీ తయారీ కేంద్రాలు ఉన్నాయి.



జీజీహెచ్‌లో రోగులకు నర్సింగ్ సేవలు

సిబ్బంది నామమాత్రం

స్కూలు నిర్వహణకు కనీసం 11 మంది సిబ్బంది ఉండాలి. వారిలో ఒక ప్రిన్సిపాల్, ఒక వైస్ ప్రిన్సిపాల్, ఓ పబ్లిక్ హెల్త్ నర్సు(టీచింగ్)తో పాటు ఎనిమిది మంది ట్యూటర్లు ఉండాలి. వీరి జీతాలకు పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. అయితే ఆ పని లేకుండా నర్సింగ్ స్కూళ్ల యాజమాన్యాలు వేస్తున్న ఎత్తులు నర్సింగ్ విద్యార్థుల భవితను నిండా ముంచుతున్నాయి. వారికి జీతాలు ఇచ్చే బదులు పరీక్షల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న వ్యక్తులకు తాయిలాలు ముట్టజెప్పి కాపీయింగ్‌కు అనధికార అనుమతులు పొందుతున్నారు. ఈ వ్యవహారంలో ఏదోలా పాసైపోతున్నాంలే అని భావిస్తున్న విద్యార్థులే సమిధలవుతున్నారు. తాజాగా ఈ వ్యవహారం బయటపడడంతో కలెక్టర్ కృతిక శుక్లా సీరియస్ అయ్యారు. ఆమె ఆదేశాలతో జూనియర్ అసిస్టెంట్‌ను అక్కడి నుంచి తొలగించారు.

కనీస వసతులు కరవు

కొద్ది రోజుల క్రితం గాంధీనగర్‌లోని జనప్రియ నర్సింగ్ స్కూల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అక్కడకు పరిశీలనకు వెళ్లిన నాటి డీఎంహెచ్ఓ నిర్ఘాంతపోయారు. అక్కడ విద్యార్థులే తమ మరుగుదొడ్లు శుభ్రం చేసుకుంటున్నారు. నేలపై నిద్రిస్తూ అవస్థలు పడుతున్నారు. ఆహారం నాణ్యత ఘోరంగా ఉంది. జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు ప్రత్యేక విభాగాలేవీ లేవు. ఫిర్యాదుల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ మిడ్‌వైఫరీ కౌన్సిల్ (ఏపీఎన్ఎంసీ) తాత్కాలిక చర్యలే చేపట్టగలుగుతోంది. శాశ్వత పరిష్కారాలు చూపలేకపోతోంది.

బోధన విధానాలు మారాలి



నర్సింగ్ కళాశాలల్లో సమస్యలు ఎదుర్కొంటున్నామంటూ పలువురు విద్యార్థులు చేసిన ఫిర్యాదు మేరకు కొన్నాళ్ల క్రితం తనిఖీలు చేశాం. కొన్నిచోట్ల నమోదైన చిరునామాలో స్కూళ్లే లేవు. ఉన్నచోట విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉంది. కనీసం వసతులు లేవు. ఎనిమిది మంది ఉన్న బోధకుల స్థానంలో కొన్నిచోట్ల ఒక్కరే ఉండగా.. మరికొన్ని చోట్ల అసలు బోధకులే లేరు. బోధన విధానాలు మారితేనే విద్యార్థుల భవిత మెరుగుపడుతుంది. నాణ్యమైన నర్సులు సమాజానికి అందుతారు.

- డాక్టర్ హేమలతాదేవి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

తొలి దశ రీ సర్వే వేగవంతం

కాకినాడ సిటీ: తొలి దశలో చేపట్టిన రీ సర్వే పనులు వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ కృతికా శుక్లా సమీక్షించారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద రీ సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉగాది రోజున సామూహిక గృహప్రవేశాలు తలపెట్టినందున ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, సీపీఓ పి.త్రినాథ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, హౌసింగ్ పీడీ బి.సుధాకర్‌పట్నాయక్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంచార వాహనాలతో పశువులకు సకాలంలో వైద్యం

- అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ సిటీ: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని (పశువుల అంబులెన్స్) కలెక్టరేట్‌లో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాడి పశువులకు అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ వాహనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులను వైద్య సేవల నిమిత్తం ఆస్పత్రులకు తరలించడం కష్టంగా ఉండేదన్నారు. ఈ వాహనాల ద్వారా పొలం లేదా ఇంటి వద్దే పశువులకు చికిత్స అందించే అవకాశం ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు 1962 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేస్తే, ఈ వాహనం వస్తుందన్నారు. తద్వారా ప్రధాన ఆస్పత్రులకు పశువులను తరలించి మెరుగైన వైద్యం అందించవచ్చునన్నారు. తొలి దశలో గత ఏడాది మే నెలలో జిల్లాకు ఏడు వాహనాలు వచ్చాయన్నారు. వీటి ద్వారా 1,600 పశువులకు చికిత్స అందించారన్నారు. వైద్యుడు, అసిస్టెంట్, డ్రైవర్‌తో కలిపి ముగ్గురు ఈ వాహనంలో ఉంటారని తెలిపారు. ఇటీవల సంచార పశు వాహనాల ద్వారా ఉత్తమ వైద్యసేవలు అందించినందుకు రూరల్ నియోజకవర్గానికి చెందిన పశువైద్యులు అవార్డు పొందడం అభినందనీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంచార పశు వాహనంలో సదుపాయాలను ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నబాబు పరిశీలించారు. అనంతరం జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు, డీడీ ఆర్.వెంకటేశ్వరరావు, ఏడీ ఎన్‌జేఎస్ సురేష్‌బాబు, పశువైద్యులు సిబ్బంది, పాల్గొన్నారు.



సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా, రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరు

కాకినాడ రూరల్: జగనన్న కాలనీల్లో పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులైన డ్వాక్రా మహిళలకు రూ.35 వేల అదనపు రుణ సాయం త్వరగా మంజూరు చేయాలని వీవోఏలు, సచివాలయం వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి కోరారు. మండల పరిధిలోని లబ్ధిదారులకు రుణాల మంజూరుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. డీఎల్‌డీఓ నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీవోఏలపై శ్రీరమణి సీరియస్ అయ్యారు. రుణాల మంజూరుకు సంబంధించి కాకినాడ రూరల్ మండలం వెనుకంజలో ఉందన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి రుణాలు మంజూరు చేయించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏసీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

యనమల సోదరుల డబుల్ గేమ్

- వారు చేసిందేమీ లేదు
- తుని నియోజకవర్గ టీడీపీలో గందరగోళం
- గృహసారథుల శిక్షణలో మంత్రి దాడిశెట్టి రాజా



గృహ సారథుల శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: నియోజకవర్గంలో కొత్త వ్యక్తికి అవకాశం కల్పిస్తామని టీడీపీ అధిష్టానం చెప్పడంతో యనమల సోదరులు కొత్త డ్రామాకు తెర తీశారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. వీరికి టికెట్ ఇస్తే ఓటమి తప్పదని ఆ పార్టీ సర్వేలో తేలిందన్నారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో తుని మండల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ సమావేశం మండల సచివాలయ కన్వీనర్ సకురు నాగేంద్ర నెహ్రూ అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రాజా మాట్లాడుతూ, నియోజకవర్గ టీడీపీ క్యాడర్‌లో అయోమయం నెలకొందన్నారు. సీటు తనదేనని యనమల కృష్ణుడు ఒకవైపు ప్రచారం చేస్తుంటే, మరోవైపు తన కుమార్తెకు సీటు ఇస్తే గెలిపించుకుంటామని రామకృష్ణుడు చెబుతున్నారని అన్నారు. ఇద్దరూ వేర్వేరుగా సమావేశాలు పెడుతున్నారని, ఎవరి సమావేశానికి వెళ్లాలో తెలియక కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారని చెప్పారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి, అంతిమంగా లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. ఈ విషయాన్ని గృహ సారథులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. చంద్రబాబు, ఎల్లో మీడియా విషపు రాతలతో లేనిది ఉన్నట్టుగా చూపే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తుని ప్రభుత్వాస్పత్రికి, రాజా కళాశాలకు రాజ సంస్థానం 13 ఎకరాల భూమి ఇవ్వడంతో పాటు ఆస్పత్రి భవనం నిర్మించిందని గుర్తు చేశారు. అయితే టీడీపీ నేత యనమల రామకృష్ణుడు స్థల దాత రాణి సుభద్రయ్యమ్మ పేరు తొలగించేందుకు జీఓ తీసుకువచ్చారని మంత్రి చెప్పారు. రాజ కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించి ఆర్డర్ తెచ్చుకున్న విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. ప్రజల ఓట్లతో 30 ఏళ్లపాటు అధికారాన్ని అనుభవించిన యనమల సోదరులు నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. వలంటీర్లు ప్రభుత్వ పరంగా పని చేస్తారని, పార్టీకి సంబంధం ఉండదని చెప్పారు. అందుకే సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. వలంటీర్ల వద్ద ఉన్న సమాచారం తీసుకుని గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో అందిన లబ్ధితో పాటు ప్రభుత్వ పనితీరుపై వివరాలు సేకరించాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహసారథులు బాధ్యతగా పని చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవరిస్తే కొత్త వారికి బాధ్యతలు అప్పగించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాస్, పెరికి కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవాని, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, ఎంపీపీ బొప్పన రాము, పార్టీ మండల అధ్యక్షుడు పోతల రమణ, నాగం దొరబాబు, దూలం మాణిక్యం, ఎస్సీ సెల్ కన్వీనర్ లంక కృపానందం, వంగలపూడి గోవిందబాబు, కె.రాఘవ, పోతుల లక్ష్మణ్, సర్పంచులు, ఎంపీటీసీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పీసీపీఐఆర్ చైర్‌పర్సన్ పర్యటన



వాకలపూడి వద్ద భారత్ మాల రోడ్డు ప్రతిపాదిత ప్రాంతంలో ఏపీఐఐసీ అధికారులతో పీసీపీఐఆర్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

కాకినాడ రూరల్: జిల్లాలోని సెజ్, వాకలపూడి ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతం, భారత్ మాల రోడ్డు ప్రతిపాదిత మార్గాన్ని పెట్రోలియం, కెమికల్స్ అండ్ పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పీసీపీఐఆర్) చైర్‌పర్సన్ విజయలక్ష్మి గురువారం పరిశీలించారు. విశాఖపట్నం నుంచి వచ్చిన ఆమె ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిధర్, సిబ్బందితో కలిసి వాకలపూడి ఎస్టేట్‌లోని పెట్రోల్, కెమికల్ పరిశ్రమలను తొలుత పరిశీలించారు. అనంతరం పోర్టు నుంచి అన్నవరం వరకూ ప్రతిపాదిత భారత్ మాల రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. యు.కొత్తపల్లి మండలంలోని సెజ్ ప్రాంతాన్ని సందర్శించి, అధికారులతో భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు.

రహదారి భద్రతపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: రహదారి భద్రతపై జిల్లా పోలీస్ అధికారులు, హైవే మొబైల్ వాహనాల సిబ్బందితో ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. వాహనాల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రమాదాలపై వాహనదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల మధ్య బ్లాక్‌స్పాట్ల వద్ద సరైన ప్రణాళికతో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసే చోదకులపై చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత 8 జోన్ల పరిధిలోనే కాకుండా ఇతర మార్గాల్లో జరిగే ప్రమాదాలపై విశ్లేషించి, సంబంధిత జోన్ ఇన్‌స్పెక్టర్లకు నివేదించాలని సూచించారు.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య

కొత్తపేట: మానసిక వ్యాధితో బాధపడుతున్న దూలం వెంకటేశ్వరి (43) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ వి.మణికుమార్ తెలిపారు. మండల పరిధిలోని వాడపాలెం మార్కెట్ వీధికి చెందిన దూలం సోలోమోన్‌రాజు – వెంకటేశ్వరి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కూడా చేశారు. వెంకటేశ్వరి 20 సంవత్సరాలుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తున్నారు. బుధవారం రాత్రి తల్లి టీవీ చూస్తుండగా.. వెంకటేశ్వరి గదిలోకి వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో ఆమెకు అనుమానం వచ్చి గదిలోకి వెళ్లి చూడగా చీరతో ఫ్యానుకు ఉరి వేసుకుని వేళ్లాడుతోంది. దానితో తల్లి కేకలు వేయగా కుటుంబ సభ్యులు వచ్చి వెంటనే కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. మృతురాలి కుమారుడు దూలం గణేష్‌సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి..

తుని: పాయకరావుపేట నాగరాజుపేట సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. గురువారం జరిగిన సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పడాల లక్ష్మీపురానికి చెందిన పాలెపు శివ(39) పాయకరావుపేట నాగరాజుపేట రైల్వేగేటు సమీపంలో నర్సీపట్నం రోడ్డు నుంచి తుని వైపు వస్తున్న గుర్తు తెలియని రైలు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు శివకు వివాహం అయ్యింది. భార్య తన నుంచి విడాకులు తీసుకుని వేరే వ్యక్తిని వివాహం చేసుకుంది. దీంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు వివరించారు.

రూ.1.30 లక్షల బంగారు, వెండి వస్తువుల చోరీ

బిక్కవోలు: మండలంలో ఇలపల్లిపాకలు గ్రామానికి చెందిన అనసూరి సత్యనారాయణ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. బిక్కవోలుకు చెందిన ఒక రైస్‌మిల్‌లో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ డ్యూటీకి వెళ్లగా భార్య బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లింది. ఆ సమయంలో దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేశారు. రెండు జతల బంగారు మురుగులు, 50 గ్రాముల వెండి మొలతాడు, రెండు చిన్న గొలుసులు మొత్తం రూ.1.30 లక్షల విలువైన వస్తువులు చోరీ జరిగినట్లు గుర్తించామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.


మొదటి మ్యాచ్ విజేత ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు


రెండో మ్యాచ్‌ను కైవసం చేసుకున్న కాకినాడ జేఎన్టీయూకే జట్టు


మూడో మ్యాచ్ గెలుచుకున్న ఆదిత్య జట్టు

పొట్టి ఫార్మెట్‌లో గట్టి ఫైట్

పోటాపోటీగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల క్రీడామైదానంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో భాగంగా గురువారం నిర్వహించిన మ్యాచ్‌లు పోటాపోటీగా జరిగాయి.

– మొదటి మ్యాచ్‌లో ఆదిత్య ఇంజినీరింగ్, ఎంఎస్ఎన్ చార్టీస్ డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆదిత్య జట్టు ఫీల్డింగ్‌ను ఎంచుకుంది. ఎంఎస్ఎన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 80 పరుగులు చేసి 5 వికెట్లు కోల్పోయింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ జితేంద్ర 20, మహేంద్ర 11, దుర్గాప్రసాద్ 4 పరుగులు చేశారు. ఆదిత్య జట్టులోని బౌలర్లు రామ్‌కుమార్, విశాల్ చెరో 13 పరుగులు ఇచ్చి ఒక్కొక్క వికెట్ తీసుకున్నారు. ఆదిత్య జట్టు నిర్ణీత ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 81 పరుగుల విజయ లక్ష్యాన్ని చేరుకొంది. ఎంఎస్ఎన్ జట్టులోని బౌలర్లు సంతోష్, జితేంద్ర చెరో ఒక వికెట్ పడగొట్టారు. 8 వికెట్ల తేడాతో ఆదిత్య గెలుపొందింది.

- రెండో మ్యాచ్ జేఎన్టీయూకే, కైట్–1 జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన జేఎన్టీయూకే బ్యాటింగ్ కోరుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 97 పరుగులు చేసి 8 వికెట్లు కోల్పోయింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ గణేష్ 43 పరుగులు, రాంప్రసాద్ 18 పరుగులు చేశారు. కైట్ జట్టులోని బౌలర్లు సతీష్ 2 వికెట్లు, నాగేంద్ర 1 వికెట్ తీసుకున్నారు. 98 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కైట్–1 జట్టు నిర్ణీత ఓవర్లలో 86 పరుగులు చేసి 3 వికెట్లు కోల్పోయింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ విష్ణు 34, నాగేంద్ర 21 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. జేఎన్టీయూకే జట్టులోని బౌలర్లు గణేష్, కిరణ్‌లు చెరో ఒక వికెట్ పడగొట్టారు. 11 పరుగుల తేడాతో జేఎన్టీయూకే జట్టు విజయం సొంతం చేసుకుంది.
- మూడో మ్యాచ్‌లో ఆదిత్య ఇంజినీరింగ్, కిట్స్ ఇంజినీరింగ్ జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన ఆదిత్య జట్టు బ్యాటింగ్ కోరుకుంది. మొదటి బ్యాటింగ్ చేసిన ఆదిత్య జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 78 పరుగులు చేసి 9 వికెట్లు నష్టపోయింది. వెంకట్ 22, సునీల్ 21, నందు 16 పరుగులు సాధించారు. కిట్స్ జట్టులోని బౌలర్లు అనీల్‌కుమార్, సాయికిరణ్ చెరో నాలుగు వికెట్లు తీసుకున్నారు. 79 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కిట్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 73 పరుగులు చేసి 8 వికెట్లు కోల్పోయింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ సిద్ధు 31, వెంకటేష్ 11, అనీల్ కుమార్ 10 పరుగులు చేశారు. ఆదిత్య జట్టులోని బౌలర్లు నరేష్ 3, రెహమాన్ 2 వికెట్లు తీసుకున్నారు. దీంతో 5 పరుగుల తేడాతో ఆదిత్య జట్టు విజయం కైవసం చేసుకుంది. గురువారం నిర్వహించిన మ్యాచ్‌లను టోర్నీ రిఫ్రెష్‌మెంట్ స్పాన్సరర్, హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్, క్రికెట్ కోచ్ చార్లి పర్యవేక్షించారు.


మొదటి మ్యాచ్ విజేత ఆర్ట్స్ కాలేజీ టీమ్


రెండో మ్యాచ్ గెలిచిన గైట్ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు


మూడో మ్యాచ్ విజేత జీబీఆర్ టీమ్

అలుపెరుగని పోరు

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడామైదానంలో నాలుగో రోజు గురువారం ఉదయం రెండు, మధ్యాహ్నం ఒక మ్యాచ్ జరిగాయి. పాల్గొంటున్న జట్లు అలుపెరుగని పోరాటం చేస్తుండటంతో ఉత్కంఠ భరిత వాతావరణంలో పోటీలు జరుగుతున్నాయి.

- ఉదయం మొదటి మ్యాచ్ గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ టీమ్‌ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ఆర్ట్స్ కాలేజీ టీమ్ బ్యాటింగ్‌ని ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 91 పరుగులు చేసి, ఏడు వికెట్లు కోల్పోయింది. జె.అజిత్ 23 బంతులకు 40 పరుగులు, సీహెచ్ మణికంఠ 13 బంతుల్లో 17 పరుగులు చేసి, టీమ్ స్కోర్ పెరిగేందుకు తోడ్పడ్డారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ టీమ్ నిర్ణీత 10 ఓవర్లలో లక్ష్యాన్ని అధిగమించలేక, ఓటమిని చవిచూసింది. 9 వికెట్లు పోగొట్టుకుని 52 పరుగులు మాత్రమే చేయడంతో ఆర్ట్స్ కాలేజ్ టీమ్‌ని 39 పరుగుల ఆధిక్యతతో విజేతగా ప్రకటించారు. ఆర్ట్స్ కాలేజీ టీమ్‌లోని అవినాష్, ధర్మేష్ చెరో రెండు వికెట్లు తీసుకుని, టీమ్ గెలుపునకు కృషి చేశారు.
- రెండో మ్యాచ్‌లో గైట్ ఇంజినీరింగ్ కాలేజీ, ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి, బ్యాటింగ్‌ని ఎంచుకున్న ఎస్‌కేవీటీ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. కె. రాజకుమార్ 15 బంతులకు 36 పరుగులు చేశాడు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన గైట్ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు 97 పరుగుల లక్ష్యాన్ని 8.4 ఓవర్లలోనే అవలీలగా అధిగమించి, 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ జట్టులో మనోజ్ 25 బంతులకు 49 పరుగులు (నాటౌట్) నవీన్ 10 బంతులకు 18 పరుగులు తీసి జట్టు విజయానికి తోడ్పడ్డారు. మనోజ్‌ని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రకటించారు.
- మధ్యాహ్నం జరిగిన మూడో మ్యాచ్‌లో బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీ, జీబీఆర్ డిగ్రీ కాలేజ్ టీమ్‌లు పోటీ పడ్డాయి. టాస్ గెలిచిన బీవీసీ టీమ్ బౌలింగ్‌ని ఎంచుకుంది. జీబీఆర్ టీమ్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. నాని 21 బంతులకు 30 పరుగులు, కె.సాయి 17 బంతులకు 28 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన బీవీసీ టీమ్ నిర్ణీత ఓవర్లలో లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి, 48 పరుగులు మాత్రమే చేయడంతో జీబీఆర్ టీమ్ 40 పరుగులు ఆధిక్యతతో విజయాన్ని అందుకుంది. బ్యాటింగ్‌లో 30 పరుగులు చేసి, బౌలింగ్‌లో రెండు వికెట్లు పడగొట్టిన జీబీఆర్ క్రీడాకారుడు నానిని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రకటించారు.
- అంపైర్లుగా అంజినీకుమార్, దినేష్‌కుమార్, రత్నకుమార్ వ్యవహరించారు.

6 నుంచి ఆపద మిత్రల శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈ నెల ఆరు నుంచి 17వ తేదీ వరకు తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఆపద మిత్రలకు ఏడో బ్యాచ్ శిక్షణ ప్రారంభం అవుతుందని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వలంటీర్లు, ఆశా వర్కర్లలో ఉత్సాహంగా ఉన్న వారిని ఆపద మిత్రలుగా ఎంపిక చేసి విపత్తులు జరిగే సమయంలో ప్రజలను ఆదుకునే విధానంపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.

జగ్గంపేటలో భారీ చోరీ

- తాళాలు పగులకొట్టి దోచుకెళ్లిన దుండగులు
- రూ.12 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, బైక్ అపహరణ

గండేపల్లి/జగ్గంపేట: ఒక విశ్రాంత ఉద్యోగి ఇంట్లోకి బుధవారం అర్ధరాత్రి దుండగులు ప్రవేశించి రూ.12 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు, ఒక బైక్‌ను దొంగిలించుకుపోయారు. జగ్గంపేట బాలాజీనగర్‌లోని ఘటనా స్థలాన్ని సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్‌ఐ సీహెచ్ విద్యాసాగర్ పరిశీలించారు. వారి వివరాల మేరకు ఉప్పలపాడుకు చెందిన బుర్రి వెంకటరమణ ఉద్యోగ రీత్యా బాలాజీనగర్‌లో ఇటీవల నిర్మించుకున్న మూడు అంతస్తుల భవనంలో రెండవ అంతస్తులో నివాసం ఉంటున్నారు. ఆయన బంధువైన విశ్రాంత ఉద్యోగి (బీఎస్ఎన్ఎల్) పుర్రె సూరన్న, ఉమాదేవి మొదటి అంతస్తులో అద్దెకు ఉంటున్నారు. సూరన్న, ఉమాదేవి బుధవారం మధ్యాహ్నం కాకినాడ వెళ్లి రాత్రికి అక్కడ ఉన్న తమ సొంత ఇంట్లో ఉండిపోయారు. తెల్లవారేసరికి జగ్గంపేటలో వారు ఉంటున్న ఇంటి తలుపు తాళాలతోపాటు బీరువా తాళాలు పగులకొట్టి ఉన్నాయి. ఇంటి యజమాని బుర్రి వెంకటరమణ గమనించి సమాచారం అందించడంతో వారు వెంటనే జగ్గంపేట చేరుకున్నారు. ఇంట్లో గల బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. దుస్తులు, వెండి వస్తువులు చెల్లా చెదురు అయ్యాయి. లాకర్‌లో ఉన్న 26 కాసుల బంగారు వస్తువులు చోరీ అయినట్టు గుర్తించారు. మూడు ఉంగరాలు, నెక్లెస్, కాసులపేరు, ఏడు జతల చెవి దుద్దులు, నాలుగు లాకెట్స్, నల్లపూసల గొలుసు, పూజా పుష్పం, గోల్డ్ బిస్కెట్, మూడు గొలుసులతోపాటు మోటార్ సైకిల్ చోరీకి గురైనట్టు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న కాకినాడ క్రైం డీఎస్పీ రాంబాబు, పెద్దాపురం ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, జగ్గంపేట సీఐ, ఎస్‌ఐ బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కాకినాడ క్లూస్ టీం వేలిముద్రలు సేకరించగా డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించింది. చోరీ జరిగిన ఇంటికి సమీపంలో గల ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో బుధవారం అర్ధరాత్రి 1.16 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రోడ్డుపై తచ్చాడటాన్ని గుర్తించారు. నీలాద్రిరావుపేట, తదితర చోట్ల గల సీసీ కెమెరాలను పోలీసు బృందాలు తనిఖీ చేస్తున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ


ఘటనా స్థలంలో తెరచివున్న బీరువా

భావితరాలకు తెలుగు మాధుర్యం

- 'నన్నయ' ఇన్‌చార్జి వీసీ ఆచార్య ప్రసాదరాజు
- ప్రాచీన తెలుగుపై సదస్సు ప్రారంభం

రాజానగరం: దేశ భాషలందు తెలుగు లెస్స అని చెప్పుకోవడం కాదు ఆచరణలోని చూపి, భావితరాలకు ఆ మాధుర్యాన్ని అందించేలా ప్రతి తెలుగోడు వ్యవహరించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. 'ప్రాచీన తెలుగు సాహిత్యం, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక దృక్పథాలు' అనే అంశం పై యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరుగనున్న జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (నెల్లూరు), భారతీయ భాషా సంస్థ (మైసూరు), 'నన్నయ' యూనివర్సిటీ తెలుగు విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సును పలువురు సాహిత్య ప్రముఖులు, యూనివర్సిటీ అధికారులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సభలో ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ పురాణాలలోని సంస్కృతిని, సాహిత్యాన్ని మన వారసులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. మైసూరుకు చెందిన భారతీయ భాష సంస్థ డైరెక్టర్ ఆచార్య శైలేంద్రమోహన్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని వివరించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ గ్రంథాలను అనువదిస్తామన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య సీవీ శివరామకృష్ణ ప్రాచీన తెలుగు సాహిత్యం, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక దృక్పథాలకు సంబంధించిన అనేక విషయాలను చర్చించారు. ఆచార్య ఆర్‌వీఎస్ సుందరం మాట్లాడుతూ మూడువేల సంవత్సరాల చరిత్ర కలిగిన అద్భుతమైన భాష తెలుగు అన్నారు. గాథాసప్తశతి కాలం నుంచి తెలుగులో జానపద పాటలున్నాయని గుర్తు చేశారు. ఆచార్య శలాక రఘునాథశర్మ మాట్లాడుతూ పద్యంలోని నాలుగు పదాలను కలిపే గొప్ప సాహిత్యం తెలుగు భాషలోనే ఉందన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా డాక్టర్ తరపట్ల సత్యనారాయణ వ్యవహరించారు. తానా సాహిత్య వేదిక నిర్వాహకులు (అమెరికా) తోటకూర ప్రసాద్, డాక్టర్ పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఆచార్య శైలేంద్రమోహన్

జాతీయ స్థాయి పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు

పెద్దాపురం: స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల యాజమాన్యం గురువారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేస్తూ ఐదో తరగతి విద్యార్థి దాడి కమల వైష్ణవి జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రోప్ స్కిప్పింగ్ అంతర్ జిల్లాల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. అలాగే 12వ తరగతి చదువుతున్న సూర్య మనీషా ఏపీ స్కూల్ ఫెడరేషన్ 66వ అంతర్ జిల్లాల ఫుట్‌బాల్–2023లో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయిందన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం, అకడమిక్ అండ్ కల్చరల్ కో–ఆర్డినేటర్లు విద్యార్థులను అభినందించారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీ ప్రకాష్ విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న విజయ్‌ప్రకాష్

దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరి అరెస్టు
- రూ.5 లక్షల విలువైన ఆభరణాలు, మోటారు సైకిల్ స్వాధీనం

పిఠాపురం: అద్దెకు ఇల్లు ఇచ్చిన వృద్ధురాలిని ఎవరూ లేని సమయం చూసి బంధించి ఆమె వద్ద ఉన్న బంగారు నగలు దోచుకెళ్లిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన ఆభరణాలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్టు పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం పిఠాపురంలో గత నెల 25వ తేదీన తాపీ మేస్త్రులమని చెప్పి ఇద్దరు వ్యక్తులు (భార్యాభర్తలు) పిఠాపురం సీతయ్యగారితోటలో నివాసముంటున్న కొత్తపల్లి సూర్య ప్రభావతి ఇంట్లో అద్దెకు దిగారు. పండగకు ఊరెళ్లి వస్తామని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చారు. గత నెల 25న ఉదయం తొమ్మిది గంటల సమయంలో తాము ఉన్న గదిలోని సింక్‌లో నీళ్లు రావడం లేదని పిలిచి, ఆమెను బంధించి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు దోచుకుని పరారయ్యారు. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గోగులపాడుకు చెందిన భార్యాభర్తలు ఉప్పతల సత్యనారాయణ, తన్నీరు కల్యాణి వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ వృద్ధులను మోసం చేయడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. ఇల్లు అద్దెకు కావాలని మోసపూరిత మాటలతో నమ్మబలుకుతారు. అదను చూసి దోపిడీలకు పాల్పడుతుంటారు. ఇదే తరహాలో సూర్యప్రభావతిని మోసపూరిత మాటలతో నమ్మించి ఇల్లు అద్దెకు తీసుకుని ఆమెను బంధించి బంగారు నగలు దోచుకున్నారు. నిందితుల నుంచి 104 గ్రాముల బంగారు నగలు, 25 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పిఠాపురం కోర్టులో హాజరు పర్చగా నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాకినాడ సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

బెండపూడి ఇంగ్లిషుపై శిక్షణ

పిఠాపురం: అమెరికన్ లాంగ్వేజ్‌లో అదరగొట్టిన బెండపూడి విద్యార్థుల ప్రతిభతో బెండపూడి ఇంగ్లిషుగా పేరొందిన రీడీనెస్ ఇన్సియేటివ్ సిట్యుయేషనల్ ఇంగ్లిషు (ఆర్‌ఐఎస్‌ఈ) శిక్షణను పిఠాపురంలో ప్రారంభిస్తున్నట్లు కోర్సు కోఆర్డినేటర్ గంటా వీర ప్రసాద్ తెలిపారు. పిఠాపురం సీబీఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఐఎస్‌ఈ కోర్సు ద్వారా బెండపూడి ఆంగ్లాన్ని పిఠాపురంలో విద్యార్థులకు నేర్పిస్తామన్నారు. బెండపూడి విద్యార్థుల మాదిరిగా రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లిషులో మంచి ప్రావీణ్యం సంపాదించాలని రాష్ట్ర ప్రభుత్వం దృఢంగా భావిస్తోందన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే రైజ్ ప్రోగ్రాం పలు పాఠశాలల్లో ప్రారంభించామన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. 35 రోజుల వ్యవధిలో పిల్లలకు అమెరికన్ లాంగ్వేజ్‌లో ఇంగ్లిషు ఉచ్చారణను నేర్పిస్తామన్నారు. చిన్నప్పుడు తాను చదువుకున్న పిఠాపురం సీబీఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కోర్సు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, ఎంఈఓ ఆర్‌వీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు వగ్రపు వీరేష్, బత్తిన రాజశేఖర్, దిమ్మల సత్తిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.అశ్వనీదేవి, పాల్ రాజు పాల్గొన్నారు.


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న కోర్సు కోఆర్డినేటర్ వీరప్రసాద్

బిక్కవోలు డ్రెయిన్‌లో డాల్ఫిన్ చేప

పెదపూడి: మండలంలోని ఏపీత్రయం శివారు బిక్కవోలు డ్రెయిన్‌లో గురువారం 150 కేజీల బరువు, 1.5 మీటర్ల పొడవు ఉన్న డాల్ఫిన్ చేప స్థానికులకు చిక్కిందని తహసీల్దార్ టి.సుభాష్, జిల్లా ఫారెస్ట్ అధికారి ఐవీకే రాజు తెలిపారు. అక్కడికి వెళ్లి స్థానికుల సహాయంతో ఏపీత్రయం వంతెన సమీపంలో డాల్ఫిన్ చేపను ఆ డ్రెయిన్‌లో విడిచిపెట్టామన్నారు. కొంతసేపటికి అది చనిపోయిందన్నారు.